ప్రజాశక్తి
సోమవారం 29 మే 2023

ఫ్యాప్టో ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బదిలీల్లో అసంబద్ధ అంశాలను తొలగించాలని, మాన్యువల్‌గా ఉద్యోగోన్నతులు కల్పించాలని ఫ్యాప్టో ఆధ్వర్యాన డిఇఒ కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. బదిలీలలో ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్నింటినీ చూపించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఇఒ కార్యాలయంలో అందుబాటులో ఉన్న డిప్యూటీ డిఇఒకు వినతి అందించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి.మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటరమణ, కో-చైర్మన్ పి.శ్రీనివాసరావు, నాయకులు వై.అప్పారావు, బుకారిబాబు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒకు వినతి అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఖరీఫ్‌కు రెడీ

- 3.03 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- అత్యధికంగా 2,34,112 ఎకరాల్లో వరి
- విత్తనాలపై కిలోకు రూ.10 రాయితీ
- 82,641మెట్రిక్ టన్నుల ఎరువులకు ఆమోదం
- సకాలంలో రైతులకు సూచనలు, సలహాలు
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.టి.రామారావు ముఖాముఖి

రానున్న ఖరీఫ్‌కు ఇప్పటికే సిద్ధమయ్యామని, ఆ మేరకు రైతులను కూడా సన్నద్ధం చేస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు తెలిపారు. వర్షాలు అనుకూలిస్తే ఈ ఏడాది సకాలంలో ఉబాలు అయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో విత్తనాలు, ఎరువులకు ఢోకా లేకుండా తగిన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో 3,03,102 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని వెల్లడించారు. ఇందులో అత్యధికంగా 2,34,112 ఎకరాల్లో వరి సాగు కానుందని, ఇందులోనూ సోనామసూరి, సాంబమసూరికి ప్రాధాన్యత కల్పిస్తున్నామని వివరించారు. వరి విత్తనాలపై ప్రభుత్వం కిలోకు రూ.10 చొప్పున రాయితీ కల్పించిందన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లకు మొత్తం 82,641 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. సకాలంలో రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, రైతులు తమ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వారం 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

? ఖరీఫ్ సీజన్‌లో ప్రధానమైన పంటలేమిటి?.

ఖరీఫ్ సీజన్‌లో మన జిల్లాలో ప్రధాన పంట వరి. మిగిలిన అన్ని పంటలకన్నా ఎక్కువగా సాగవుతుంది. ఆ తరువాత స్థానంలో మొక్కజొన్న, చెరకు, నువ్వులు ఉంటాయి. రాగులు, మినుములు, పెసలు, కందులు వంటి పప్పుదినులు చాలా స్వల్ప విస్తీర్ణంలోనే సాగవుతాయి. అన్ని రకాల పంటలకు క్రాప్ ఇన్సురెన్స్ సదుపాయం ప్రభుత్వం కల్పించింది.

? ఈ ఏడాది పంటల సాగు ఎంత విస్తీర్ణంలో ఉంటుంది?.

గత ఖరీఫ్‌లో 2,90,476 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 3,03,102 ఎకరాల్లో సాగయ్యే విధంగా రైతులను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో వరి 2,34,112 ఎకరాలు, మొక్కజొన్న 31,375 ఎకరాలు, నువ్వులు 18,305 ఎకరాలు, చెరకు 11,525 ఎకరాలు, పత్తి 5,105 ఎకరాలు, వేరుశనగ 868 ఎకరాలు, రాగులు 96 ఎకరాలు, మినుములు, పెసలు, కందులు తదితర అపరాలు 329 ఎకరాల్లో సాగవుతాయని అంచనా.

? ఈ ఖరీఫ్‌లో దిగుబడి ఏమేరకు వస్తుందని అంచనావేశారు?.

వాతావరణం అనుకూలించడంతో గత ఖరీఫ్‌లో ఎకరాకు 2,102 కేజీల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది కూడా వర్షాలు అనుకూలిస్తే కనీసం రెండు వేల కేజీల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేశాం. మొక్కజొన్న గత ఏడాది ఎకరాకు 2,117 కిలోల దిగుబడి రాగా, ఈ ఏడాది 2,185 కిలోలు వస్తుందని ఆశిస్తున్నాం. పత్తి, చెరకు కూడా దాదాపు గత ఖరీఫ్‌తో సమానంగా వస్తుందని అంచనా.

ముఖాముఖి

? ఈ ఏడాది ఏయే రకాల వరి విత్తనాలను ప్రోత్సహిస్తున్నారు?.

ఈ ఏడాది మన జిల్లా భూసారం, నీటి లభ్యతను బట్టి ఏడు రకాల వరి విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇందులో ముఖ్యంగా సోనామసూరి (బిపిటి 3291) 4,520 క్వింటాళ్లు, సాంబమసూరి (బిపిటి 5204) 2,289 క్వింటాళ్లు, అమర (ఎంటియు 1064) 2,600 క్వింటాళ్లు అందుబాటులో ఉంచనున్నాం. అత్యల్పంగా సూపర్ ఫ్రైమ్ కొత్తరకం వెరైటీ (ఎంటియు 1318) 382 క్వింటాళ్లు, రాగోలు సన్నాలు (ఆర్‌జిఎల్ 2573) 204 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నాం.

? వరి విత్తనాలపై సబ్సిడీ ఎంత? ఏ విధంగా సరఫరా చేయనున్నారు?.

అన్ని రకాల వరి విత్తనాలపైనా కిలోకి రూ.10 చొప్పున ప్రభుత్వం సబ్సిడీ కల్పించనుంది. పచ్చిరొట్ట విత్తనాలు మాత్రం 50శాతం సబ్సిడీపై పొందవచ్చు. మిగిలిన పంటల విత్తనాలు ప్రయివేట్ మార్కెట్‌లో రైతులకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా వరి విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగానే ఆర్‌బికెల్లో దరఖాస్తు చేసుకోవాలి. వారు సాగుచేసే విస్తీర్ణానికి తగ్గట్టు ఆర్‌బికె సిబ్బంది ప్రతిపాదన పెడతారు. రైతులు దరఖాస్తు చేసుకున్నప్పుడే సబ్సిడీ పోగా మిగిలిన మొత్తాన్ని జమచేయాలి. ఇలా చెల్లించిన రెండో రోజుల్లోపు విత్తనాలు రైతులకు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

? ఎరువుల అవసరం ఏమేరకు ఉంటుంది?.

ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని ఏడాదికి 82,641 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమౌతాయని అంచనా. ఈ మేరకు ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి పంపాం. అనుమతులు కూడా లభించాయి. అత్యధికంగా యూరియా 47,401 మెట్రిక్ టన్నులు, డిఎపి 13,422 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 13,467 మెట్రిక్ టన్నులు జిల్లాకు రానున్నాయి. ఎంఒపి 6,092 మెట్రిక్ టన్నులు, సూపర్ పాస్ఫేట్ 2,257 మెట్రిక్ టన్నుల చొప్పున వస్తాయి. జిల్లాకు రావాల్సిన ఎరువుల్లో 50శాతం ఎరువులు మార్క్‌ఫెడ్‌కు, 50 శాతం ప్రయివేటు మార్కెట్‌కు వెళ్తాయి. మార్క్‌ఫెడ్‌కు వచ్చిన ఎరువుల్లో 70 శాతం ఆర్‌బికెల ద్వారా, మిగిలిన 30 శాతం పిఎసిఎస్‌ల ద్వారా రైతులకు సరఫరా అవుతాయి.

ఘటనా స్థలంలో క్షతగాత్రులు

ఘోరం

- ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీ
- ముగ్గురు మృతి
- ఒకరి పరిస్థితి విషమం



మృతిచెందిన గ్రీష్మ, సత్యారావు, నాగరాజు

ప్రజాశక్తి-గంట్యాడ

అతివేగం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఇద్దరు ఒకే కుటుంబానికి చెందిన వారు. ఈ సంఘటన మండలంలోని కరకవలస సమీపంలో పప్పులమిల్లు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం...

మండలంలోని వసాది గ్రామానికి చెందిన లోకవరపు సత్యారావు (40) విజయనగరంలో నివాసముంటున్నారు. ఆదివారం తన స్వగ్రామమైన వసాదికి ద్విచక్రవాహనంపై తల్లి సత్యవమ్మ, కుమారుడు విష్ణు, తన అన్న కుమార్తె గ్రీష్మ(11)తో కలిసి వస్తున్నారు. కొటారుబిల్లి జంక్షన్‌కి చెందిన దుర్గాసి నాగరాజు (45) ఇదే మార్గంలో విజయనగరం వైపు అతివేగంగా వస్తున్నాడు. పప్పులమిల్లు వద్ద ఎదురుగా బైక్‌పై వస్తున్న సత్యారావు కుటుంబాన్ని ఢీకొన్నాడు. దీంతో ఘటనా స్థలంలో నాగరాజు, గ్రీష్మ మృతిచెందారు. సత్యారావు, సత్యవమ్మకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరిని 108 వాహనంలో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యారావు మృతిచెందాడు. సత్యవమ్మ పరిస్థితి విషమంగా ఉంది. శవ పంచనామా అనంతరం నాగరాజు, గ్రీష్మ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వసాది గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సాఫ్ట్‌బాల్ విజేత విజయనగరం

వైఎస్ఆర్ జిల్లా టి.సుందిపల్లిలో ఈ నెల 26 నుంచి నిర్వహిస్తున్న పదో రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం బాలుర జట్టు ప్రథమ స్థానం నిలిచింది. బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించిందని సెట్విజ్ సిఇఒ రామ్‌గోపాల్ తెలిపారు.

– ప్రజాశక్తి, విజయనగరం

విన్నర్, రన్నర్ ట్రోఫీలను అందుకుంటున్న విజయనగరం బాలురు, బాలికల జట్లు

వాటర్ ప్లాంట్ ఎత్తేయాల్సిందే

లేకుంటే ప్లాంటు ముందే పోరాటం ● ప్రజాభిప్రాయ చర్చా వేదికలో తీర్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనావాసాల మధ్యలో నిర్వహిస్తున్న అక్రమ వాటర్ ప్లాంట్లను తక్షణమే సీజ్ చేయాలని, లేదంటే ప్లాంటు ముందే పోరాటం చేస్తామని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, అయ్యప్పనగర్ కాలనీ అధ్యక్షులు యుఎస్ రవికుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం అయ్యప్పనగర్‌లో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజాభిప్రాయ చర్చావేదికలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా రెడ్డి శంకరరావు మాట్లాడుతూ అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్లను తొలగించాలని స్పందనలో కలెక్టర్‌కు, కార్పొరేషన్ అధికారులకు, భూగర్భజల శాఖ అధికారి దుర్గాప్రసాద్‌కు వినతులు అందించినా ప్లాంట్‌ను తొలగించలేదన్నారు. అధికారులు నోటీస్ ఇచ్చినా ప్లాంట్ యజమానులు లెక్కచేయకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి, అక్రమ వాటర్ ప్లాంట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్లాంట్ ఎదుట పోరాటం చేస్తామని హెచ్చరించారు. అయ్యప్పనగర్ కాలనీ అధ్యక్షులు యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ జనావాసాల మధ్య వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయకూడదన్న నిబంధన ఉందని గుర్తుచేశారు. నిబంధనలకు విరుద్ధంగా అయ్యప్పనగర్‌లో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయడం వల్ల నివాసాల్లో ఉన్న బోర్లు పనిచేయడం లేదన్నారు. అయ్యప్పనగర్ స్వామి లేఅవుట్‌లో ఏ వాటర్ ప్లాంట్‌కీ అనుమతి ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం నడుస్తున్న వాటర్ ప్లాంట్లు అక్రమమేనని తేల్చిచెప్పారు. వెంటనే ప్లాంట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుధీర్, మురళీ, శ్రీనివాస్, నారాయణరావు, కాలనీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ చర్చావేదికలో మాట్లాడుతున్న అయ్యప్పనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహిళాభ్యుదయానికి కృషిచేసిన మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కనకల మహాలక్ష్మి కోరారు. ఆదివారం నగరంలోని కోట జంక్షన్, పుచ్చలవీధిలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పుచ్చలవీధిలో టిడిపి నాయకులు ముచ్చు రామలింగస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ఎన్‌టిఆర్‌దేనని చెప్పారు. బిసిల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నందమూరి అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, తెలుగు మహిళా పార్లమెంట్ కార్యదర్శి అనురాధ బేగం, టిడిపి లీగల్ అడ్వైజర్ రవి, పి.రామారావు, దువ్వ రాము, కనకల మన్మథరావు, బంటుపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

30న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 30న మధ్యాహ్నం మూడు గంటల నుంచి జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సిఇఒ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థాయీ సంఘాల సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

బంద ఆక్రమణలో వైసిపి హస్తం!

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని కోటగిరివారిబంద ఆక్రమణ వెనుక వైసిపి హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 2019 ఎన్నికలకు ముందు తారకరామ కాలనీని అనుసరించి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడు లేఅవుట్ వేశారు. ఆ లేఅవుట్‌ను ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారికి 2019లో అమ్మేశారు. ఆ లేఅవుట్లో అపార్ట్‌మెంట్లు నిర్మించాలంటే 30 అడుగులు రోడ్డు ఉండాలి. బొబ్బిలి-పార్వతీపురం రోడ్డు నుంచి లేఅవుట్‌కు 15 అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. కానీ, 30 అడుగుల రోడ్డు వేసి ఇస్తామని అప్పట్లో లేఅవుట్ కొనుగోలు చేసిన రియల్ వ్యాపారికి హామీ ఇచ్చారు. దీంతో లేఅవుట్‌కు 30 అడుగుల రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టారు.

మున్సిపల్ నిధులతో రోడ్డు

లేఅవుట్‌కు మున్సిపల్ నిధులతో రోడ్డు వేస్తున్నారు. బొబ్బిలి-పార్వతీపురం రోడ్డు నుంచి లేఅవుట్ వరకు రోడ్డు వేసేందుకు రెండు భాగాలుగా విభజించి మున్సిపల్ నిధులు కేటాయించారు. ఒక్కో బిట్‌కు రూ.10 లక్షలు చొప్పున కేటాయించారు. రాష్ట్రీయ రహదారి నుంచి ఒక బిట్ రోడ్డు రూ.10 లక్షలతో పూర్తి చేశారు. రెండో బిట్ రోడ్డు పనులు చేసేందుకు రోడ్డుకు అడ్డంగా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో పనులకు బ్రేక్ పడింది. ట్రాన్స్‌ఫార్మర్ మార్చిన తర్వాత పనులు చేపట్టనున్నారు.

రోడ్డు కోసం మిల్లు స్థలం

టిఆర్ కాలనీ వద్ద ఉన్న లేఅవుట్‌కు వేసే రోడ్డు పక్కన ఎన్నో ఏళ్ల నుంచి పిండి మిల్లు ఉండేది. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో పిండిమిల్లును తొలగించి రోడ్డు వేశారు. మిల్లు తొలగింపును యజమాని వ్యతిరేకించడంతో వేరే చోట స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో అత్త సొమ్ము అల్లుడు దానం చేసిన చందంగా కోటగిరివారిబంద స్థలంలో మిల్లు నిర్మాణానికి వైసిపి పెద్దలు అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బంద ఆక్రమణపై పట్టణంలో పలు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఆక్రమిత స్థలంలో వేసిన నిర్మాన వ్యర్థాలు, ఇసుక

ఆక్రమణలు తొలగించండి

పట్టణంలోని కోటగిరివారిబంద ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అధికారులను డిమాండ్ చేశారు. బందలో ఆక్రమణ నిర్మాణాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారకరామ కాలనీ అనుసరించి ఉన్న కోటవారిబందను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, బందలను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని నిలదీశారు. బంద ఆక్రమణపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజల ఆదరాభిమానాలు మరువలేనివి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తన కుటుంబంపై ప్రజల ఆదరాభిమానాలు మరువలేనివని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం తన జన్మదినం సందర్భంగా యాదాద్రిలో లక్ష్మీనరసింహస్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. నలుగురికీ సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని ఆయన తెలిపారు. తన జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

అన్నార్తులను ఆదుకోవడం అందరి బాధ్యత

అన్నార్తులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేట నీళ్ల ట్యాంకు వద్ద ఆరో ఫుడ్ బ్యాంకును డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ ప్రారంభించారు. పేదలకు ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ స్ఫూర్తి ప్రదాతగా, ప్రజాసేవే ధ్యేయంగా సాగుతున్న కోలగట్ల ఆశయ సిద్ధి కోసం తామంతా కృషి చేస్తున్నామని తెలిపారు. వైసిపి జోనల్ ఇన్‌ఛార్జులు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు, బండారు ఆనందరావు, డిప్యూటీ మేయర్ ఈసరపు రేవతి దేవి, తదితరులు పాల్గొన్నారు.

కోలగట్ల వీరభద్రస్వామి పుట్టినరోజు సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు వేత్సా సత్యనారాయణ మూర్తి, వాసవీ క్లబ్ అధ్యక్షులు కందుల సంతోష్, బలభద్రుని నానాజీ పాల్గొన్నారు.



యాదాద్రి ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సిఎం కోలగట్ల వీరభద్రస్వామి ; ఫుడ్‌బ్యాంకు వద్ద అన్నదానం నిర్వహిస్తున్న డిప్యూటీ శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ దంపతులు

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

రాష్ట్ర జాతాను జయప్రదం చేయండి

సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన చేపడుతున్న రాష్ట్ర జాతాను విజయవంతం చేయాలని సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతా పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకపోగా బలవంతంగా ఆప్కోస్‌లో చేర్పించిందని ఆగ్రహించారు. తద్వారా ఉత్పన్నమైన సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్ డబ్బులు చెల్లించలేదని చెప్పారు. కార్మికులకు మూడు నెలలుగా హెల్త్ అలవెన్స్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. రెండేళ్లుగా రక్షణ పరికరాలు అందించడం లేదని ఆవేదన చెందారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 31న ఇచ్ఛాపురంలో రాష్ట్ర జాతా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. జూన్ ఒకటో తేదిన మధ్యాహ్నం రెండు గంటలకు విజయనగరంలోని పాలాసుపత్రి వద్దకు చేరుకుంటుందని తెలిపారు. మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ కార్యదర్శి బి.భాస్కరరావు, నాయకులు బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

టిడిపి సంక్షేమ నిధికి రూ.5లక్షలు విరాళం

కృష్ణను సత్కరిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కృష్ణరాయుడుపేట గ్రామానికి చెందిన టిడిపి నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ టిడిపి సంక్షేమ నిధికి రూ.5లక్షలు విరాళం అందించారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న మహానాడులో ఈ చెక్కును ఆయన పార్టీ అధినేత చంద్రబాబుకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు గొంప కృష్ణను ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- వేపాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రరీ ఎన్ స్వామినాయుడు మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరం ద్వారా విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆశక్తి పెరిగిందన్నారు. ఇప్పటికే పలుమార్లు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేసి ప్రోత్సహించామని చెప్పారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులు ఆటోమెటిక్ వాటర్ ప్లాంట్‌ను తయారు చేశారు. దీంతో వారిని లైబ్రేరియన్ మహేష్ అభినందించారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలు, బాలికలు రుతుక్రమాల సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని లంకాపట్నం పిహెచ్‌సి వైద్యులు పల్లవి తెలిపారు. ఆదివారం రుతుక్రమ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, శానిటరీ నేప్‌కిన్స్ వాడకంపై నగరంలో మెప్మా ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. లంకాపట్నం పిహెచ్‌సి పరిధిలో మహిళలతో ర్యాలీ చేపట్టారు. రాజీవ్ నగర్ కాలనీ పిహెచ్‌సి పరిధిలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన రుతుక్రమాల పట్ల బిడియాన్ని, అపోహలను విడనాడాలన్నారు. ముఖ్యంగా నేప్‌కిన్స్ కొనుగోలు చేసి తెచ్చే బాధ్యత పురుషులే స్వీకరించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ విషయంలో పరస్పర భావాలను పంచుకోవడం మంచిదన్న విషయాన్ని సూచించారు..

పూర్తిస్థాయి ఎంపిడిఒగా కాశీ విశ్వనాథరావు

ప్రజాశక్తి- రేగిడి

గన్నవరపు కాశీ విశ్వనాథరావును పూర్తిస్థాయి ఎంపిడిఒ అధికారిగా నియమించినట్లు జెడ్‌పి కార్యాలయం నుంచి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఇంచార్జి ఎంపిడిఒగా ఆయన కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా గ్రామస్థాయి, మండల స్థాయి అధికారుల సహకారంతో పనిచేస్తునని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ర్యాలీ, పరుగులో పాల్గొన్న నిర్వాహుకులు, క్రీడాకారులు

3కెఎం సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నెల రోజులుగా జరుగుతున్న బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో ఆదివారం ఉదయం క్రీడాకారులచే మూడు కిలోమీటర్ల పరుగు, సైకిల్ ర్యాలీని నిర్వహించారు. పాఠశాల పీడీ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో 40 మంది క్రీడాకారులు సైకిల్ పై, 37 మంది క్రీడాకారులు పరుగుతోను ధర్మవరం, కొట్టం బ్రిడ్జి వరకు, మరల అక్కడి నుంచి పాఠశాల వరకు ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్‌కోట రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, సిఐ తారకేశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తగరంపూడి రమణ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రేపాక రాజా, రిటైర్డ్ ఆర్మీ జవాన్ పోరాపు వెంకటరావు పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పీడీ రాములు మాట్లాడుతూ 30వ తారీకుతో ఈ శిక్షణా శిబిరం ముగుస్తుందన్నారు. ముగింపు రోజున క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు, క్రీడా దుస్తులు ఇస్తామన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని గోస్తని నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ తారకేశ్వరరావు కొరడా ఝులిపించారు. ఆదివారం తెల్లవారు జామున మామిడిపల్లి, గోపాలపల్లి వద్ద గోస్తనీ నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు, ఎస్ఐ సహకారంతో ఇసుక రవాణా చేస్తున్న వారిపై దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిని పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్ కి తరలించి కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

సంతకాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు శంకరరావు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర రావు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆదివారం చిక్కాల రెల్లివీధిలో సంతకాలు సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేస్తామని పాదయాత్ర, ఎన్నికల్లో హామీ ఇచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి ఆచరణలో అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. 010 పద్దు కింద వేతనాలు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సంతకాల సేకరణ కాపీలను గవర్నర్‌కు అందజేస్తామన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు గవర్నర్ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి. శంకర్రావు, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు జి. గౌరీ, జె. రామారావు బి. వెంకటి, చిన్ని కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?

ప్రజాశక్తి- బొబ్బిలి


గోతులమయమైన బలిజిపేట రోడ్డు

రోడ్డంతా గోతులు మయంగా ఉంటే ప్రయాణం ఎలా అంటూ వాహనదారులు, ప్రజలు ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రశ్నిస్తున్నారు. బొబ్బిలి పట్టణంలోని బలిజిపేట రోడ్డు అధ్వాన్నంగా మారింది. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో రాకపోకలకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్ బంకు జంక్షన్ నుంచి శ్రీవేణుగోపాలస్వామి ఆలయం జంక్షన్ వరకు రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేసి అక్కడ నుంచి అమ్మిగారి కోనేరుగట్టు వరకు జరగలేదు. శ్రీవేణుగోపాల స్వామి ఆలయం జంక్షన్ నుంచి అమ్మిగారి కొనేరుగట్టు వరకు రోడ్డు గోతులుమయంగా మారింది. పూల్ బాగ్ రోడ్డు పరిస్థితి కూడా ఇలానే ఉంది. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని, పూల్ బాగ్ రోడ్డు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రీసర్వేతో లెక్కలు తేలేనా.?

- నెల్లిమర్లలో పెరిగిన భూ ఆక్రమణలు • సర్వేను అడ్డుకుంటున్న అక్రమార్కులు • అక్రమాలను బయటపెట్టాలని స్థానికుల డిమాండ్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వం చేపట్టిన డ్రోన్ (రీ సర్వే) సర్వేతో ప్రభుత్వ భూముల లెక్కలు తేలేనా అని నగర పంచాయతీ వాసులు చర్చించుకుంటున్నారు. ఇటీవల నగర పంచాయతీలో అధికార్లు డ్రోన్ సర్వే ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటికే చంద్రబాబు నగర కాలనీ సర్వే నెంబర్ 60, శ్రీ రాంనగర్ కాలనీ సర్వే 88, 17, 89, తెలకల వీధి సర్వే 52, ఆర్‌టిసి కాంప్లెక్స్ సర్వే 59, పాత తహశీల్దారు కార్యాలయం సర్వే నెంబర్ 45లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ స్పందనలో ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ భూములు అక్రమాలకు గురై అమ్మకాలు, కనుగోలు జరుగుతున్నాయని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో బాటు కొంత మేర అటవీ భూములు కూడా అక్రమాలు జరిగినట్లు సమాచారం. కాగా సర్వే నెంబర్ 316లో మిగులు భూమి కింద అప్పట్లో 49 ఎకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ భూములను కొంత మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఈ భూములు కూడా చేతులు మారి కొంత మంది ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇటీవల తాజాగా రెవెన్యు సిబ్బంది 316లో సర్వే చేయడానికి వెళ్తే మొదటి రోజు సహకరించిన వారు మరుచటి రోజు వెళ్తే మా భుములు సర్వే చేయవద్దని అడ్డుకున్నట్లు సమాచారం. కాగా ఈ భూములు చేతులు మారి ప్రైవేటు వ్యక్తుల చేతిల్లో ఉండడం వల్ల సర్వేను వారి ప్రభావంతో అడ్డుకున్నట్లు సమాచారం. అయితే భూముల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డ్రోన్ సర్వేతో ప్రభుత్వ భూముల లెక్కలు తేలుతాయా అని పలు అనుమానాలు కలుగుతున్నాయి. అయితే సర్వేను అడ్డుకున్న తరువాత రెవెన్యూ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం పైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగర పంచాయతీలో ఉన్న మొత్తం ప్రభుత్వ భూములను ఈ సర్వే ద్వారా రీ సర్వే చేసి ఆక్రమణలను తొలగించడంతో పాటు ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని నగర పంచాయతీ వాసులు కోరుతున్నారు.

చంద్రబాబు నగర్‌లో ఆక్రమణకు గురైన భూములు ఇవే

నెల్లిమర్లలో సర్వే చేస్తున్న అధికారులు

మండలంలో పలు గ్రామాల్లో (కొండ వెలగాడ, మాల్యాడ) చెరువుల, డి. పట్టా భూములు సైతం ఆక్రమణకు గురయ్యాయి. ఈ భూముల పై ఫిర్యాదులు కూడా అధికార్లకు వెళ్తే పట్టించుకోకుండా రికార్డులు తారుమారు చేశారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక్కడ కూడా రీ సర్వే చేసి చెరువులు, డి. పట్టా భూములను ఆక్రమించుకున్న వారి నుంచి వాటిని రక్షించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పుస్తకపఠనం అలవర్చుకోవాలి

చీపురుపల్లి : చిన్నతనం నుండి పుస్తకపఠనం అలవర్చుకోవాలని ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. ఆశయ యూత్ అసోసియేషన్, ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో బాలభవన్ ఆవరణలో వేసవి శిక్షణకు వచ్చే విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఫోన్ల ప్రభావం నేటి విద్యార్థులు, యువత పై చాలా ఎక్కువ కనిపిస్తోందన్నారు. పుస్తకాలు మెదడుకు వ్యాయామం లాంటివని, చదివే వారికి అల్జీమర్స్ లాంటివి త్వరగా రావని పరిశోధనలో వెల్లడైందని గుర్తు చేశారు. స్మార్ట్ ఫోన్లు వచ్చాక మనిషి ఎనిమిది సెకన్ల కన్నా ఎక్కువ దేనిమీదా దృష్టి పెట్టలేకపోతున్నాడని మైక్రోసాఫ్ట్ అధ్యయనం చెబుతుందన్నారు. పుస్తకపఠనం ఏకాగ్రతని పెంచు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతా మందిరం నిర్వహాకులు ప్రకాష్ రావు, బాలభవన్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమణ

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు మండలంలోని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఊరురా ఎన్‌టిఆర్ విగ్రహాలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూసపాటిరేగ రాజ వీధిలో గల ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎంపిటిసి పిన్నింటి లక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భోగేష్, పిడిఎ ప్రసాద్, పిన్నింటి అప్పలనాయుడు, పిన్నింటి జయరాం, బుత్తల అప్పారావు, కోరాడ రమేష్, నడిపేనా గౌరి, పిట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళు అర్పిస్తున్న నాయకులు

వేపాడ: మండలంలోని బానాదిలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను ఎంపిటిసి గొంప తులసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సిరికి రామలక్ష్మి, సేనాపతి సత్యవతి, సేనాపతి లీల, పి.అప్పలనాయుడు, రిక్కి సన్నిబాబు, తిర్రి నాగరాజు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

కొత్తవలస: వియ్యంపేట మాజీ సర్పంచ్ పుటిబంటి రాము ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జగదీష్, బొబ్బిలి రమణ, గొంప దుర్గా ఉమేష్, చిన్నిలు, పిఎస్‌ఆర్, చిన్నిపాలెం పైడిరాజు, ఎస్. అప్పలనాయుడు, కోట సన్యాసిరావు, విన్నకోట వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నివాళి

బొబ్బిలి రూరల్ : మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ఆదివారం పక్కి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల కోసం నందమూరి తారక రామారావు అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయార న్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ గంట పైడిరాజు, పంచాయతీ వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు తెంటు సత్యం నాయుడు, బొద్దల సత్యనారాయణ, బంకురు తిరుపతి, లెంక శ్రీను, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మహిళలకు రుతు క్రమంపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహిళలకు రుతు క్రమంపై అవగాహన ఉండాలని నగర పంచాయతి చైర్‌పర్సన్ బంగారు సరోజినీ అన్నారు. ఆదివారం ప్రపంచ నెలసరి పరిశుభ్రత అవగాహన దినోత్సవం సందర్భంగా నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న వార్డు మహిళా కార్యదర్శులు, వార్డు వాలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మెప్మా ఆర్‌పిలు, మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులతో అవగాహన సదస్సును నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతు క్రమం సమయంలో మహిళలు తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యుక్త వయస్సు నుంచి దీనిపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయం నుండి రామతీర్థం జంక్షన్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనరు పి.బాలాజీ ప్రసాద్, మేనేజర్ టి.వి.ఎస్ విశ్వేశ్వర రావు, మెప్మా సిఎంఎం డి.గోవింద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, నగర పంచాయతీ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ర్యాలీ చేస్తున్న నగరపంచాయతీ చైర్‌పర్సన్, కమిషనర్

బొబ్బిలి: ర్యాలీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

బొబ్బిలి: మెప్మా ఆధ్వర్యంలో బొబ్బిలి మున్సిపాలిటీలో ప్రపంచ రుతుస్రావ దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆదివారం అవగాహనా కార్యక్రమం, ర్యాలీ, ఆటలు, పాటలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళి కృష్ణారావు, స్థానిక సిహెచ్‌సి వైద్యులు డాక్టర్ స్వాతి టిఎల్‌ఎఫ్ ప్రెసిడెంట్ తూముల బంగారు రాణి, మెప్మా సిఎంఎం జి.రాము, రామలక్ష్మి, డిఇఒ భాను, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంట కలిసిన మానవత్వం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఒకే దగ్గర పడి ఉన్న ఆవుల కళేబారాలు

పశువులు కంటే మనుషులే హీనంగా ప్రవర్తిస్తున్నారు. మనుషులలో రోజురోజుకు మానవత్వం దిగజారుతుంది. దీనికి నిదర్శనం ఈ ఫొటోలో కనిపిస్తున్న పశువులనే చెప్పవచ్చును. పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి సాగిస్తున్న రైతులు, వ్యాపారులు అవి మరణిస్తే మాత్రం పాతిపెట్టకుండా రోడ్డు పక్కనే పడేసిన సంఘటన పాత బొబ్బిలి-లచ్చయ్యపేట మధ్యలో ఉన్న పైపులు ఫ్యాక్టరీ వద్ద చోటు చేసుకుంది. పైపులు ఫ్యాక్టరీ సమీపంలో నాలుగు ఆవులు మరణించగా వాటిని పాతి పెట్టకుండా రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో పడేశారు. మరణించిన ఆవులు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆవులు బతికున్న సమయంలో సొమ్ము చేసుకున్న రైతులు, వ్యాపారులు అవి మరణిస్తే పాతి పెట్టాలనే మానవత్వం లేకపోవడం అన్యాయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పశువులు మానాపురం సంతకు వ్యాన్‌లో తరలిస్తుండగా మరణించి ఉండవచ్చునని చర్చ జరుగుతుంది. రవాణా ఖర్చులు తగ్గించుకునేందుకు వ్యాన్‌లో పశువులను కిక్కిరిసి తరలించడం వల్లనే పశువులు మరణిస్తున్నాయి. గతంలో పాత బొబ్బిలి, గొర్లె సీతారాంపురం వద్ద లారీలలో తరలిస్తున్న పశువులు మరణించాయి. పశువులు రవాణాపై దృష్టి పెట్టి పశువుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

మత్స్యకారులను ఆదుకోవడంలో విఫలం

ప్రజాశక్తి - భోగాపురం

మత్స్యకారులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని జనసేన మత్స్యకార వికాస విభాగం చైర్మన్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు లోకం నాగ మాధవి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ముక్కాం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ మత్స్యకారులకు అన్ని విధాల అన్యాయం జరిగిందని, మత్స్యకార భరోసా కూడా పూర్తిస్థాయిలో అందలేదని అన్నారు. జనసేన అధికారంలో కొస్తే మత్స్యకారులను పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని తెలిపారు. సొంత డబ్బులతో రైతులను ఆదుకునే ఘనత పవన్ కళ్యాణ్‌కి దక్కుతుందన్నారు. నాలుగేళ్లలో ఎన్ని ఫిషింగ్ హార్బర్లు కట్టారో వైసిపి నాయకులు చెప్పాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, మరల అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తుందని అన్నారు. అనంతరం మత్స్యకార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూగి శ్రీనివాసరావు మాట్లాడుతూ నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఇంటిపేరుకు తగ్గట్టుగా కొండలను ఆక్రమించుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో ఆయన్ను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లి చనిపోతే ఇప్పటివరకు ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునే పరిస్థితి లేదని అన్నారు. కనీసం మత్స్యకార గ్రామాలలో తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

మాట్లాడుతున్న బొమ్మిడి నాయకర్, నాగమాధవి

మత్స్యకార గ్రామాలకి సొంత ఖర్చులతో తాగునీరు

తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార గ్రామాలైన ముక్కాం, కొండరాజుపాలెం, చౌడిపల్లి పేట గ్రామాలకు సొంత ఖర్చులతో తాగునీరు అందిస్తానని జనసేన నాయకులు లోకం మాధవి హామీ ఇచ్చారు. మత్స్యకారుల పిల్లల ఉన్నత చదువుల కోసం ప్రత్యేక నిధిని కేటాయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర లీగల్ సెల్ అధ్యక్షులు ఏ. దుర్గా ప్రశాంతి, దెందులూరు నియోజకవర్గ ఇంచార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, లోకం ప్రసాద్, నాయకులు వందనాల రమణ, రాంబాబు, పల్లంట్ల జగదీష్, అట్టాడ ప్రమీల, మత్స్యకార గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వైఖరిపై జనసేన ఆగ్రహం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వైఖరిపై జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆసుపత్రి రోడ్డులో ఆదివారం జనసేన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెర్లాం మండలంలోని నందిగాంలో జరిగిన గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలు, ఉద్యోగాలపై ఎమ్మెల్యే శంబంగిను జనసేన మండల అధ్యక్షులు మరడాన రవి ప్రశ్నిస్తే వైసిపి కార్యకర్తలు, నాయకులకే ఇచ్చుకుంటామని బాధ్యతారాహిత్యంగా సమాధానం చెప్పడం అన్యాయమన్నారు. రాజకీయాలకు అతీతంగా పాలన చేస్తున్నామని సిఎం జగన్ చెపితే బొబ్బిలి నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలకే పథకాలు, ఉద్యోగాలు ఇస్తామని ఎమ్మెల్యే శంబంగి అనడం సిగ్గుచేటన్నారు. జగన్ ప్రజల సొమ్ముతో నగరానికి ఒక ప్యాలెస్ నిర్మించుకుని రూ. కోట్లలో వ్యాపారాలు చేసుకుంటున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే స్వప్రయోజనాలను పక్కన పెట్టి ప్రజలు కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంచాన గంగాధర్, మరడాన రవి, వీర మహిళ యందువ యామిని, బొబ్బిలి నాయకులు పల్లెం రాజా, రామకృష్ణ నాయుడు, ఉమ, సత్య, శివ శంకర్, చీమల సతీష్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

5250 ఎకరాల్లో వరి సాగు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎఒ పూర్ణిమ

ముందస్తు ప్రణాళికలతో మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 5250 ఎకరాల్లో తవరిసాగు విస్తీర్ణం లక్ష్యంగా పెట్టుకున్నామని ఎఒ ఎం.పూర్ణిమ తెలిపారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వరి విత్తనాలు 1050 క్వింటాళ్ళ కేటాయింపు చేశామన్నారు. 16 రైతు భరోసా కేంద్రాల్లో 50శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎరువులు 321 మెట్రిక్ టన్నుల సిద్ధంగా ఉన్నాయని, యూరియా198 టన్నులు, డిఎపి 78 టన్నులు, పోటాష్ 40 టన్నులు కేటాయింపు జరిగిందని తెలిపారు. కాగా రైతులు ఆధార్, 1బితో రైతు భరోసా కేంద్రంలో ముందుగా రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు జీలుగు, పిల్లి పెసర, కట్టి జనుము, వరి సాగుకి ముందు పంట పొలాల్లో వేసుకుంటే నేల సారవంతమై దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు కోసం ముందస్తు ప్రణాళికలతో రైతులను సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్‌టిసి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

నగరంలోని ఎత్తు వంతెన సమీపంలో డివైడర్‌ను ఢీకొని ఆదివారం మధ్యాహ్నం ఆర్‌టిసి ఉద్యోగి ఎవిజి నాయుడు (58) మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఆర్‌టిసి డిస్పెన్సరీలో పని చేస్తున్న నాయుడు కంటోన్మెంటులో నివాసం ఉంటున్నారు. తోటపాలెంలో సొంతింటి నిర్మాణ పనులు నిమిత్తం ఉదయం వెళ్లి మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై తిరిగి కంటోన్మెంట్‌లోని ప్రస్తుతం ఉంటున్న ఇంటికి వస్తుండగా, ఎండధాటికి డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో స్థాని కులు, పోలీసులు అతన్ని ఆటోలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతునికి భార్య, పిల్లలున్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ ఎస్ఐ రామ్ గణేష్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

గంట్యాడ: మండలంలోని పెదమజ్జి పాలెం గ్రామానికి చెందిన మహంతి ముసలి నాయుడు (65) పురుగుల మందు తాగి మృతి చెందాడు. గంట్యాడ ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాలు ప్రకారం.. మృతుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ బాధతోనే శనివారం రాత్రి ఎవరు లేని సమయం చూసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ముసలి నాయుడును విజయనగరం కేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోస్టుమార్టం నిమిత్తం పంచినామా అనంతరం విజయనగరం కేంద్ర ఆస్పత్రికి తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.త

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆర్థిక ఇబ్బందులు తాళలేక మండలంలోని కొట్టం గ్రామానికి చెందిన నున్నగొప్పుల శ్రీహరి (27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి మృతి విషయమై స్థానికులు, ఎస్.ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. కొట్టాం గ్రామానికి చెందిన శ్రీహరి విశాఖపట్నం జివిఎంసి వద్ద మూడు కార్లు అద్దె ప్రాతిపదికన తిప్పుతూ అక్కడే నివాసం ఉంటున్నాడు. తల్లిదండ్రులు సీతంనాయుడు, బాలాజీ, తమ్ముడు హేమంత్ స్వగ్రామంలో వ్యవసాయం చేస్తున్నారు. విశాఖపట్నంలో ఉంటున్న శ్రీహరి శనివారం మధ్యాహ్నం కొట్టాం గ్రామంలోని ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇంట్లోని వారు పొలం పనుల్లో ఉన్నారు. పెద్ద కుమారుడు ఇంటికి వచ్చిన విషయం తల్లిదండ్రులకు తెలియదు. రాత్రి భోజనాలు చేసిన అనంతరం మేడ పైన గల గదికి వెళ్లేందుకు చూడగా లోపలి నుండి గడియపెట్టి ఉందని, దీంతో స్థానికుల సాయం తీసుకుని తండ్రి, తమ్ముడు గునపాంతో తలుపు బద్దలుకొట్టి చూడగా శ్రీహరి తాళ్లతో మెడకు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని ఎస్.ఐ పరిశీలించి చాలా సేపటి కిందటే ఉరి వేసుకుని మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్.ఐ జె.తారకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెట్టింగులే కారణమా?

కాగా శ్రీహరి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు క్రికెట్ బెట్టింగులు కారణంగా తెలిస్తోంది. పలువురు వద్ద నుంచి చేసిన అప్పులు తీర్చడం ఎలా అని మదనపడి ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని అనుకుంటున్నారు.